క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. శ్రీరామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడిని కలిసిన మాలసంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: అలనాటి రామచంద్రుడు సినిమా దర్శకుడు చిలుకూరి ఆకాష్ రెడ్డిని మాల సంఘం నేతలు ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో మాల సంఘం నాయకులు సింగరి అశోక్, బేర దేవన్న, మేకల మల్లన్న, సూరం భగవాండ్లు, మల్లయ్య, దాసరి బాబన్న, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు, రాళ్ల బండి శంకర్, తొగరి భాస్కర్, పొచ్చన్న, ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం

ఎదులాపురం: కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే ధ్యేయంగా ఐఎఫ్టీయూ యూనియన్ టీయూసీఐ కార్మిక సంఘంలో విలీనం కానుందని ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి జగన్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఢిల్లీలో ఐఎఫ్టీయూ, టీయూసీఐల మధ్య జరిగిన సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. కార్మిక సంఘాలన్నీ ఏకం కావాల్సిన ఆవశ్యకతను గురించి చర్చించడం జరిగిందన్నారు.

బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, వెంకటేశ్, రవి, హరిప్రసాద్, బొడ్డు కిరణ్, సతీష్, మధుకర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో డబుల్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. రోడ్డు పనులు ప్రారంభించి దాదాపుగా ఎనిమిది నెలల కావస్తున్న పనులు ప్రారంభ దశలోనే ఉన్నయన్నారు. దీంతో మండల కేంద్రం ప్రజలతో పాటుగా ప్రతీ నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రిమ్స్ అవుట్‌పోస్టింగ్ పోలీసులు బాధితుడికి ఆదివారం అప్పగించారు. కొలాంగూడకు చెందిన ప్రవీణ్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న విషయాన్ని అవుట్‌పోస్టింగ్ కానిస్టేబుల్ వెంకట్‌కు తెలియజేశాడు. దీంతో ఆయన సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకొని అందజేశాడు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు

ఉట్నూర్‌రూరల్: బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణానికి భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరణకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు వినోద్ కుమార్, లక్ష్మణ్, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి సృజనలను ఆదివారం ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

- ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు
- పోషకాలు మెండుగా ఉండడంతో మంచి డిమాండ్
- అధిక లాభాలు పొందుతున్న రైతు



డ్రాగన్ ఫ్రూట్ చేనులో భోయర్ ప్రశాంత్

జైనథ్: మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు భోయర్ ప్రశాంత్ వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తనకున్న వ్యవసాయ క్షేత్రంలో, దీర్ఘకాలిక పంటలు వేయాలని ఆలోచనలో ఉన్నా.. ఆయనకు కరోనా సమయంలో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఆసక్తి కలిగింది. అధిక పోషకాలు ఉండడం, స్థానిక రైతులు సాగు చేయకపోవడం, మార్కెట్లో సైతం మంచి ధర పలుకుతుండటంతో 2022 జూన్‌లో కౌఠ గ్రామంలోని తన 1.10 ఎకరం విస్తీర్ణంలో రూ.7 లక్షల ఖర్చుతో 'రింగ్ అండ్ పోల్' విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రారంభించాడు. 14 నెలలకే మొక్కలు ఏపుగా పెరిగి కాత ప్రారంభం కావడంతో 2023లో 1.5 టన్నుల దిగుబడి వచ్చింది. పండ్లకు స్థానికంగా మంచి డిమాండ్ ఉండడంతో దాదాపు రూ. 1.70 లక్షల ఆదాయం వచ్చింది. ఈఏడాది 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతు చెబుతున్నాడు. ఒక్కొక్క పండు అరకిలో పైగా తూగుతోందని, డిసెంబర్ నెలవరకు కనీసం 2 టన్నులపైగా దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు రైతు అంచనా వేస్తున్నాడు. ఈ లెక్కన ఈఏడాది కనీసం 2 నుంచి 2.5 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

పోషకాల గని డ్రాగన్..

డ్రాగన్ ఫ్రూట్‌ను పోషకాల గనిగా అభివర్ణిస్తారు. విటమిన్లు, ప్రోటీన్లతో పాటు ఐరన్ వంటి అనేక రకాల మినరల్స్ కూడా పండ్లలో లభించడంతో రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ఈ పండ్లు ఎంతగానో దోహదం చేస్తాయని వైద్యులు సైతం సిఫారసు చేస్తున్నారు. ఇలాంటి డ్రాగన్ ఫ్రూట్‌ను స్థానికంగా పండించడమే కాకుండా మంచి లాభాలను ఆర్జిస్తుండడంతో రైతులు సైతం డ్రాగన్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులతో పాటు అనేక మంది రైతులు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు.

రైతులకు ఆదర్శంగా..

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయినప్పటికీ కూడా వ్యవసాయంపై మక్కువతో ఖాళీ సమయంలో పంట క్షేత్రాన్ని సందర్శిస్తూ డ్రాగన్ సాగు చేపడుతున్న ఉపాధ్యాయుడు భోయర్ ప్రశాంత్‌ను రైతులు, స్థానికులు అభినందిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు భోయర్ ప్రశాంత్ వ్యవసాయ క్షేత్రాన్ని ఒక కేస్ స్టడీ లాగా అధ్యయనం చేస్తూ ఇతర రైతుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నారు.

> **మంచి లాభాలు పొందవచ్చు**
>
> సాధారణ పంటలు వేస్తే సీజన్ సీజన్‌కు భూమిని సిద్ధం చేయడం, పాత పంటలు తీసేసి కొత్త పంటలు వేయడం ఇబ్బందితో కూడుకున్న పని. అదే డ్రాగన్ ఫ్రూట్ అయితే ఒక్కసారి వేసుకుంటే దాదాపు 25 సంవత్సరాల పాటు దిగుబడి వస్తుంది. ప్రతిఏటా కలుపుతీత, సేంద్రియ ఎరువులు, నీటి తడులు చిన్న చిన్న ఖర్చులు భరిస్తే మంచి లాభాలు పొందవచ్చు.
>
> – భోయర్ ప్రశాంత్, రైతు

'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



త్రివర్ణ పతకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 12న సోమవారం రోజు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ముత్నూర్ నుంచి ఇంద్రవెల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆగస్టు 15న తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అదే విధంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెస్రం తుకారం, కోవ రాజేశ్వర్, కనక తుకారం, రాథోడ్ భీంరావ్, మెస్రం జైరాం, కనక హనుమత్‌రావ్, ముండే రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు రాథోడ్ రితేశ్, కొండేరి రమేశ్, వెంకటేశ్, రవి, హరిప్రసాద్, బొడ్డు కిరణ్, సతీశ్, మధుకర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నార్నూర్: ఆజాదిక అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు భిక్షపతి రాథోడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద త్రివర్ణ పతకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాదిక అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు.. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారిగూడలో ప్రభుత్వం పాఠశాల ఆవరణలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చిన్న పిల్లల కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీచౌక్‌లో గల రీతన్య ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నివిధేత రెడ్డి చిన్న పిల్లల వైద్యులు, ఆదర్శ రెడ్డిల సౌజన్యంతో నిరుపేదల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు ఆసిఫ్, సాబీర్ పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి



అయ్యప్ప ఆలయంలో మొక్కలు నాటుతున్న నారాయణ మహరాజ్

ఇచ్చోడ: ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం అయ్యప్ప ఆలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సనాతన ధర్మ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకునే దిశగా ధర్మ సేవా సమితి సభ్యులు కృషి చేయడం అభినందనీయమన్నారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేశ్, నాయకులు

ఇచ్చోడ: హైదరాబాద్‌లో ఈనెల 13న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల భూమయ్య, దుబాక సుభాష్, చిటి రవిలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తర్వాత ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్న సందర్భంగా స్వాగత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కాశిపాక విష్ణు, కల్లెపెల్లి రాజు, జన్నరపు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

13న భారీ ర్యాలీ

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ, ఈనెల 13న ఢిల్లీ నుంచి మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌కు వస్తున్నందున లక్ష డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్వీపర్ కాలనీలో మాట్లాడారు. మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాలోని ఎమ్మార్పీఎస్, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉప్పరి సురేశ్, శ్రావణ్, అనిల్, ఒరగంటి సతీష్, వెంకటేశ్, మురళీ, మల్యాల శివ కృష్ణ, ఆకాంక్ష్ అజయ్, నరేశ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: సాక్షి దినపత్రికలో ఆదివారం 'పారిశుధ్యంపై పట్టింపేది' కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో చోర్గావ్, గొండుగూడ, మధుర తండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పాఠశాల, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. గత 20 రోజులుగా క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తుండడంతో పారిశుధ్యం, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

ఎంపీ పరామర్శ

తలమడుగు: మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన గ్రామ పటేల్ కోవా భీంరావు, అదే గ్రామానికి చెందిన సురేందర్ మాతృమూర్తి కనక లక్ష్మిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతి చెందిన కుటుంబసభ్యులను ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు కసపర్తి చంద్రకాంత్, వెంకటస్వామి, ప్రభాకర్, మహేందర్ యాదవ్, నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, అశోక్, నాగన్న, గణేష్, భుజంగరావు ఉన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఆడెపు రమేశ్ తల్లి ఇటీవలే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పరామర్శిస్తున్న ఎంపీ గోడం నగేశ్

'చిక్‌మాన్'పైనే రైతుల ఆశలు

- ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- ఇటీవల డిప్యూటీ సీఎం ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



చిక్‌మాన్ ప్రాజెక్టు

సిరికొండ: చినుకు పడితే కానీ పంట పండదు. భగీరథ ప్రయత్నా చేస్తే తప్పా సాగునీరు అందదు. వ్యవసాయ భూమి ఉంది అని గొప్పగా రైతు చెప్పుకోవడం తప్పా.. సాగు నీరు అందని పరిస్థితి. సిరికొండ మండలంలో సాగునీరు అందించే జలవనరు చిక్‌మాన్ ప్రాజెక్టును గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. కానీ కొందరి రైతులకు మాత్రమే మేలు జరిగింది. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మండలంలోని అందరి రైతులకు మేలు చేస్తామని రైతులకు భరోసా కల్పిస్తోంది.

ప్రాజెక్టు నిర్మిస్తే..

గతం 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మండలంలోని చిక్‌మాన్ వాగుపై 381 మీటర్ల ఎత్తుతో మూడు ఎకరాల్లో 0.144 టీఎంసీల నీటి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు వరద నీటితో పూర్తిగా నిండి కేవలం 3200 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే సాగునీరు అందిస్తుంది. దీంతో కొద్ది మంది రైతులకు మాత్రమే మేలు జరుగుతుంది. ప్రాజెక్టును ఎత్తుగా నిర్మిస్తే మండలంలోని సుమారుగా ఉన్న 20 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించవచ్చు.

బడ్జెట్‌లో నిధులు..

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసిన అన్ని పార్టీల నాయకులు చిక్‌మాన్ వాగు ప్రాజెక్టును పునఃనిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడం, ఇటీవలే బడ్జెట్ సమావేశాల్లో సిరికొండ మండలంలోని చిక్‌మాన్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 26 కోట్లు నిధులు కేటాయించడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చిక్‌మాన్ ప్రాజెక్టు పనుల కోసం నిధులు మంజూరు చేసి, త్వరతగతిన పనులు ప్రారంభించాలని మండల రైతులు కోరుతున్నారు.

> **రైతులకు మేలు**
>
> 
>
> కాంగ్రెస్ హయాంలో నిర్మించిన చిక్‌మాన్ ప్రాజెక్టు, తిరిగి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు కేటాయించింది. ఈ నిర్ణయంతో మండల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మండల రైతుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
>
> – షేక్ ఇమామ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరికొండ

> **సాగునీరు అందుతుంది**
>
> 
>
> చిక్‌మాన్ ప్రాజెక్టు నిర్మాణం చేయడం ద్వారా మండలంలోని భూములకు సాగు నీరు అందుతుంది. దీంతో రైతులు మూడు పంటలు పండించవచ్చు. మండలం మొత్తం సస్యశ్యామలం అవుతుంది.
>
> – గోర్పండ్ సదానంద్, రైతు, సిరికొండ

అధ్వాన రోడ్లతో అవస్థలు



ఆదిలాబాద్‌రూరల్: అసోదా గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



తాంసి: బురదమయంగా గుబిడి రోడ్డు



నేరడిగొండ: వాంకిడి వద్ద కోతకు గురైన రోడ్డు

తాంసి/ఆదిలాబాద్‌రూరల్/నేరడిగొండ: భీంపూర్ మండలంలోని కరంజి(టి) నుంచి గుబిడి గ్రామం వరకు ఉన్న రోడ్డు, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అసోదా, బొప్పాపూర్, పూనగూడ గ్రామాల రోడ్లు, తాంసి మండలంలోని గిరిగాం గ్రామానికి వెళ్లే రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. గత కొంది రోజులుగా కురిసిన వర్షానికి బురదమయంగా మారాయి. కనీసం నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి. అలాగే నేరడిగొండ మండలంలోని వాంకిడి పాత జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి కోతకు గురైంది. దీంతో ప్రజలు, వాహదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం అధికారులు దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన 'లైవ్' అధ్యక్షుడు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న మహేందర్

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం సందర్శనకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదివారం వేర్వేరుగా వచ్చారు. ఈసందర్భంగా జలపాతం అందాలను వారి కుటుంబ సభ్యులతో కలిసి తిలకించారు. కాగా లంబాడాల ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్, సవర్గాం మాజీ సర్పంచ్ జాదవ్ కల్యాణిలు శాలువాతో కలెక్టర్‌ను సత్కరించారు. కుంటాల జలపాతం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.